



# పెళ్ళాం ఊరెళితే?

పి. బాలకృష్ణారావు

“బ్రతుకు బుగ్గి చేసిన సారా” కథల పోటీలో ఈ వారం ఎన్నికయిన కథ

పుస్తకాలబ్బాయ్ అప్పుడే “ప్రియ దత్త’ తీసుకువచ్చాడు. నాకిష్టమైన (గళ్ళ)నుడి కట్టండి! పేజీ తిరగేసి పాత పజిల్‌ను సరిగ్గా రాశానా, లేదా చూస్తున్నంతలో “తాతగోరూ! తాత గోరూ!” అంటూ మా పనిమనిషి సూరమ్మ తాలూకు నాలుగేళ్ళ కొడుకు పరుగు పరుగున వచ్చి, “మాయ మ్మొందా? వెళ్ళిపోయిందా?” అంటూ ఎగశ్వాస పీల్చుకుంటూ ఎదురు ప్రశ్న వేశాడు. నేను పుస్తకం లోంచి పెరటివైపు తేరిపార చూసేలోగా వాడు రివ్వున సందు లోంఛి పరుగున వెళ్ళి అదే వేగంతో తిరిగి వచ్చేసి “మాయమ్మ నేదండి ఎవరింటికి ఎల్లిందీ” సొణుగుకుంటూ దౌడుతీశాడు.

ఆ తర్వాత ఒక అరగంట పోయాక సూరమ్మ సన్నగా ఏడుస్తూ సందులోంచి పెరట్లోకి వెళ్ళింది. వాళ్ళ అమ్మకు ఏమీ బాగా లేదంట. నేలకు దింపేశారంట. కడసారి చూపులకు వెళ్ళాలంటూ బుడిబుడిరాగాలు తీస్తూ మూడు వందల రూపాయలు ఎలాగైనా సర్దమని కాళ్ళావేళ్ళా పడి తీసుకుంది. వెంటనే తన చిన్నకొడుకు రాజేష్‌గాడిని, చేతిబిడ్డ లక్ష్మిని పట్టుకుని వచ్చిన మనిషితోనే తన కన్నవారింటికి వెళ్ళిపోయింది. సూరమ్మ మొగుడు సూరిగాడు ఎక్కడుంటాడో సూర మ్మకు తెలియదు. ఎప్పుడూ ఇంటివద్ద ఉం డడు. మొగుడితో చెప్పమని పక్కింటి గోవింద మ్మతో మరీమరీ చెప్పి దారిలో తోపుడుబండి మీద చలువబట్టలు ఇస్త్రీ చేస్తున్న పెద్దకొడుకు శీనుగాడితో కూడా చెప్పేసి ఏడ్చుకుంటూ, మొత్తుకుంటూ రాగాలు తీసుకుంటూ వెళ్ళి పోయిందిట.

సరిగ్గా మిట్టమధ్యాహ్నం రెండు గంటల ప్పుడు శీనుగాడి బండి వెనక్కి తిప్పి భోజనానికి యింటికి వచ్చాడు. బండిని వేపచెట్టు కింద నీడలో పెట్టాడు. ఇస్త్రీ పెట్టెను తీసుకుని యింట్లోకి దూరాడు. ఎండాకాలం కదా ఎండలు బాగా మండిపోతున్నాయి. నిప్పులు చెరుగుతున్నాయి. ఇంట్లో తల్లి లేదు. ఆకలి దంచేస్తోంది. పెట్టుకు తిందామంటే ఓపిక లేదు. ఇంతలో పక్కింటి గోవిందమ్మత్త వచ్చి శీనుగాడికి వడ్డించి పెట్టింది. పూసగుచ్చినట్లు అంతా చెప్పింది. శీనుగాడికి తల్లి యింతకు ముందే చెప్పినట్లు ఈవిడకు తెలియదు. కోడిపుంజు చంకనేసుకుని కోడి పందాలనుండి వస్తున్న సూరిగాడికి ఎవరో దారిలో యింతకు యింత చెప్పారంట. ఇంటికొచ్చి శుభ్రంగా కాళ్ళు చేతులు బాగా కడుక్కుని సుష్టుగా భోజనం చేసి నులక మంచం వేపచెట్టు కింద వేసుకుని హాయిగా కునుకు తీశాడు. వాడికి అత్తగారి స్థితికన్న సూరమ్మ గుంపాం వెళ్ళి పోయినందుకు గొప్ప హాయిగా ఉంది. పెళ్ళాం ఊరెళ్ళింది కదా స్వేచ్ఛ! పూర్తిగా స్వేచ్ఛా వాయువులు పీల్చుకుని పగటికలలు కన్నాడు.

సాయంకాలం సూరిగాడు తిన్నగా కల్లు పాక దగ్గరకు వెళ్ళిపోయాడు. పీకలదాకా తాగేశాడు.

రాత్రి తొమ్మిది గంటలప్పుడు నేను రోడ్డు మీద గాలి పోసుకుందామని బయట వాలు కుర్చీ వేసుకుని కూర్చున్నాను. మా మనవడు నాలుగేళ్లవాడు వీధి పోరగాళ్ళతో రోడ్డుమీద ఆడుకుంటున్నాడు. దూరంగా సూరిగాడు తూలుకుంటూ, తొట్రుకుంటూ రోడ్డుకు అటు వైపు, యిటువైపు అడ్డంగా కొలుచుకుంటూ రావటం పిల్లలంతా చూసి “తాతగోరూ రాజేష్ వాళ్ళ నాన్న తాగేసి వస్తున్నాడం”టూ ముసి ముసి నవ్వులు కురిపించారు. సూరిగాడు అంత మత్తులో కూడా జాగ్రత్తగానే అడ్డంగా వాళ్ళింట్లో దూరి లల్లాయి పదాలు పాడు కుంటూ నిద్రలో ఒరిగాడు. వాడి సంగతి అంద

## సింగిల్ పేజీ కథలకు ఆహ్వానం

'ప్రియదత్త' సకుటుంబ సచిత్ర వారపత్రికలో సింగిల్ పేజీ కథలు ప్రచురణార్థం రచయిత(త్రు)లకు ఆహ్వానం పలుకుతున్నాం. సింగిల్ పేజీ కథలు పంపేవారు ఈ క్రింది సూచనలు గమనింప కోరతాము.

☆ కథ అర ఠావు సైజులో 3 పేజీలు మించరాదు.

☆ పేజీకి ఒక వైపు మాత్రమే రాయాలి.

☆ కథ తమ స్వీయ రచన అని, అముద్రితమని, హామీ పత్రాన్ని విధిగా జతపరచాలి.

☆ కథ చివరిభాగంలో, చిరునామాను వ్రాయాలి.

☆ కథలను త్రిప్పి పంపగోరువారు తగినన్ని స్టాంపులంటించిన స్వంత చిరునామా గల కవరును జతపరచాలి. - ఎడిటర్

రకూ తెలిసిందే. ఇంట్లో సూరమ్మ లేదు. నిషాలో ఏవేవో లోకాల్లో విహరించాడు లాగుంది.

మర్నాడు బాగా తెల్లవారినతర్వాత శుభ్రంగా స్నానాది కాలకృత్యాలు తీర్చుకుని, ఇస్త్రీ బట్టలు తెల్లనివి తొడుక్కుని కొత్త పెళ్ళికొడుకులా ముస్తాబై "బావుగారూ మాయత్తమ్మను బయటేసినారంట నాను కడసారి సూపులకు ఎల్లాలా? వద్దా? సెప్పండి. బస్సు సార్జీకి డబ్బుల్లేవు. ఇలాగెల్లి అలా పోయొత్తాను. ఒక్క ఏబై రూపాయలు సర్దండి బావూ.. నాకూ మాట దక్కుతుంది. మీకు పున్నెం కలుగుతుంది." నమ్రత ఉట్టిపడేట్లు రెండు చేతులు కట్టుకుని బుద్ధిమంతుడిలా అడిగాడు. వాడి మాటలకు పడిపోయి యిచ్చాను. సూరిగాడు వెళ్ళిపోయాడు. తర్వాత శీనుగాడు వచ్చి "తాతగారూ మా అయ్య ఎక్కడకు ఎల్లాడండీ.. కల్లుపాకకు ఎల్లిపోయి తాగేస్తాడు" తల వంచి సిగ్గుపడి చెప్పేసి తోపుడు బండి తోసుకుంటూ వెళ్ళిపోయాడు.


నా దగ్గర చేబదులడిగినట్లు యింకెంత మంది దగ్గర అడిగాడో తెలియదుగానీ సూరిగాడు ఆ రోజంతా యింటి ఛాయలకు వచ్చినట్లు లేదు. నాకెందుకో సిక్స్ సెన్స్ కీడు శంకిస్తోంది. బహుశా అత్తను చూడటానికి గుంపాం వెళ్లవచ్చు కదా! సాయంకాలం కూడా యింటికి రాలేదు. వాడు నిజంగా తప్పతాగి ఏదైనా ప్రమాదం జరిగితే ఆ పాపంలో నాకూ భాగం ఉంటుంది. ఎందుకో మనస్సాక్షి ఒకంతట కుదుటపడటం లేదు. కనిపించని దేముళ్ళందరికీ పేరు పేరున సూరిగాడికి ఏ ప్రమాదం రాకూడదని మొక్కుకున్నాను. రాత్రికి కూడా వాడి జాడ లేదు. నాకు నిద్ర పట్టలేదు. పిచ్చి పిచ్చి ఆలోచనలు. కోడి కూసిన వేళకు నిద్ర పోయాను. భళ్ళున తెల్లారిపోయింది. ఏదో కీడు రాబోతుందని మనస్సు కీడించుతోంది. సరిగ్గా అదే జరిగింది.

మా వీధిలోని పెద్ద గలభా. సూరిగాడు రాత్రి పూట బైపాస్ రోడ్ దాటుతుండగా ఏదో లారీ గుద్దేసి పోయిందిట. బలమైన గాయాలు తగిలి రోడ్డు పక్కన పడి ఉన్నాడంట. చీకటితో కాలకృత్యాలకు రోడ్ వైపు వెళ్ళిన వాళ్ళు సూరిగాడి మూలుగు విని గుర్తుపట్టారంట. వాడిని అలాగే అటువైపు పెద్దాసుపత్రికి తోలుకపోయారంట. లారీ కాళ్ళ మీంచి పోయింది. డాక్టర్లు అయిదువేలు కేష్ తీసుకు వస్తే ఆపరేషన్ చేస్తామన్నారని ఆ వాడలోని పెద్దలంతా నా దగ్గరకొచ్చి "బాబుగారూ సూరిగాడికి అన్యాయం జరిగిపోనాది. మీరే కట్టం కాయాల. మా దగ్గరెక్కడ అంత సొమ్ములుంటాయి. రెక్కాడితే డొక్కాడని జీవాలం. మీరే ఎట్టాగో పుణ్యం కట్టుకోవాల. మాకు మీరే భగమంతులు." లబోదిబోమన్నారు. సరే డబ్బులిచ్చి పంపాను. ఆపరేషన్ సక్సెస్ అయ్యింది. సూరిగాడి రెండు కాళ్ళూ మోకాళ్ళదాకా తీశారు. సూరమ్మ గుంపాం నుండి ఎంతో సంతోషంతో వచ్చింది తల్లి బాగుందని. సూరిగాడి సంగతి విని కుప్పకూలిపోయింది. దానిని ఓదార్చటం ఎవ్వరితరం కాలేదు. పది రోజుల తర్వాత డిస్చార్జి చేశారు.

బ్రతుకు బుగ్గిపాలు చేసిన సారా గురించి మా కాలనీలో అందరికీ గుణపాఠం సూరిగాడి జీవితమే. ఇది ఎందరికో కనువిప్పు కావాలి. ఆరు మాసాల తర్వాత సూరిగాడు రెండు కర్ర కాళ్ళతో కుంటోడి జీవితం కొనసాగించ సాగాడు. ✵

ఈ రచయితకు బహుమతి సొమ్ము త్వరలోనే అందజేయబడుతుంది.
- ఎడిటర్


గ్యాస్ ట్రబుల్
మలబద్ధకము
అజీర్ణము తో
బాధ పడుతున్నారా?
క్యాప్‌జైమ్
చూర్ణమ్ ను వాడండి




తయారుచేయువారు :
చంద్రిక ఆయుర్వేదిక్ ఫార్మసీ
విజయవాడ-9
మార్కెట్ చేయువారు :
రామా మెడికల్ డిస్ట్రిబ్యూటర్స్ & కో.,
పార్కు రోడ్, విజయవాడ-1
ఫోన్ : 2424133